ADMISSIONS ARE IN PROGRESS 2024-25
Secretary & Correspondent
Bikki Venkateshwarlu
M.Sc (Physicis), M.Ed.
Join your kids with us & Empower their Academic Excellence with Ethical Foundations
INDIRA VIDYALAYA
Nursery to VII class, English Medium
Near Bodrai, Mahabubabad.
Cell: 9701912300, 9705412300


దిన పత్రిక
# తొలి సమయం
వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 02 సంచిక : 181 ఆదివారం 06-07-2025 ఎడిటర్ : వేముల అయోధ్య రాములు పేజీలు : 4 వెల : 5 రూ/..

గొంతు కోసి ఐదేళ్ల బాలిక
## దారుణ హత్య
**జగిత్యాల జిల్లా కోరుట్లలో ఘటన..**



**కోరుట్ల, జూలై 5:** అభం శుభం తెలియని ఐదేళ్ల బాలికను గొంతు కోసి దారుణంగా హత్య చేశారు. ఆడుకునేందుకు సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిన ఆమె.. అదే కాలనీలోని మరొకరి ఇంటి బాత్రూంలో రక్తపు మడుగులో శవమై కనిపించింది. శనివారం జగిత్యాల జిల్లా కోరుట్లలో చోటుచేసుకున్న ఈ ఘటన సంచలనం రేపింది. పోలీసుల వివరాల మేరకు.. ఆదర్శనగర్‌లో నివాసముంటున్న ఆకుల రాములు-నవీన దంపతులకు కుమారుడు వేదాస్, కూతురు హితిక్ష(5) ఉన్నారు. రాములు ఉపాధి నిమిత్తం కొద్దిరోజుల కింద గల్ఫ్‌కు వెళ్లగా నవీన అత్తామామలతోనే ఉంటోంది. సాయంత్రం కాలనీకి చెందిన పిల్లలతో హితిక్ష ఆడుకుంటూ కనిపించకుండాపోయింది. దీంతో చుట్టుపక్కల వెతికిన హితిక్ష బంధువులు పోలీసులకు సమాచారమిచ్చారు. ఈ నేపథ్యంలోనే స్థానికుల సాయంతో పోలీసులు వెతుకుతుండగా.. అదే కాలనీలోని కొడుపల్లి విజయ్ అనే వ్యక్తి ఇంటి బాత్రూంలో హితిక్ష రక్తపు మడుగులో పడి ఉండడాన్ని గుర్తించారు. హుటాహుటిన బాలికను ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. విజయ్ ఇంట్లో హితిక్ష రక్తపు మడుగులో పడి ఉండడంతో అతడే హత్య చేసి ఉంటాడని బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే విజయ్‌కు ఇంటి యజమాని ఫోన్ చేయగా తాను వరంగల్ జిల్లా నర్సంపేటలో ఉన్నానని చెప్పినట్లు సమాచారం. సంఘటనా స్థలాన్ని ఎస్పీ అశోక్‌కుమార్ పరిశీలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.




## న్యాయమంటే శిక్షలే కాదు..
# బాధితులకు భరోసా
### లైంగిక దాడుల బాధిత పిల్లలకు న్యాయం, గౌరవంతోపాటు బాల్యాన్నీ తిరిగివ్వాలి

- **ఆ చిన్నారులకు అన్ని దశల్లో సర్కారు అండగా ఉంటుంది**
- **చైల్డ్ పోర్నోగ్రఫీ విషయంలో అత్యంత కఠినంగా ఉండండి**
- **సోషల్ మీడియా దోషుల్ని వదలొద్దు**
- **లైంగిక దాడుల బాధిత చిన్నారుల రక్షణ, భద్రత సదస్సులో సీఎం**
- **బాలల భద్రత జాతీయ బాధ్యత**
- **సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ సూర్యకాంత్**
- **పోక్సో నిందితుల్లో 98% మంది కుటుంబ సభ్యులు, బంధువులు,**
- **ఇరుగుపొరుగే: జస్టిస్ సుజోయ్ పాల్**

**హైదరాబాద్, జూలై 5:** "న్యాయమంటే కేవలం శిక్షలు విధించడమే కాదు. బాధితుల జీవితానికి భరోసా కల్పించడం. లైంగిక దాడుల బాధిత చిన్నారులకు అవసరమైన రక్షణ, సమాజంలో తగిన గౌరవం కల్పించేలా చర్యలు తీసుకోవడమే కాదు.. వారు తమ బాల్యాన్ని తిరిగి పొందడానికి అందరూ ప్రయత్నించాలి" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. పిల్లలు, మహిళల రక్షణకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందన్నారు. సోషల్ మీడియా విషయంలో అందరూ అప్రమత్తంగా ఉండాలని, దానిని దుర్వినియోగం చేస్తున్న వారి పట్ల ఎలాంటి కరుణ చూపాల్సిన అవసరం లేదని, దోషుల విషయంలో కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.

మిగతా 4లో...

కాంగ్రెస్ సర్కారుపై
## ధర్మయుద్ధం
- **600 రోజులైనా ఆరు గ్యారంటీల అమలేదీ?**
- **సీఎం పదవికి రేవంత్ రాజీనామా చేసి బీసీకి ఇస్తే.. నేను అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తా**
- **స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతాం**
- **బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు**
- **రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతల స్వీకరణ**



**హైదరాబాద్, జూలై 5:** కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు ఆరోపించారు. రాష్ట్రంలో అవినీతి, అధర్మ పాలన సాగుతోందన్నారు. ప్రజలను దగా చేసిన కాంగ్రెస్ ప్రభుత్వంపై ధర్మయుద్ధం చేస్తామని ప్రకటించారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి నుంచి పార్టీ అధ్యక్ష బాధ్యతలను రాంచందర్‌రావు స్వీకరించారు. అనంతరం అధ్యక్షుడి హోదాలో తొలిసారిగా మీడియా సమావేశంలో మాట్లాడారు. గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో రైతులు, మహిళలు, విద్యార్థులను మభ్యపెడుతూ అనేక హామీలు ఇచ్చిందని, కానీ.. అధికారంలోకి వచ్చాక డబ్బుల్లేవని, ప్రభుత్వం భిక్షాటన స్థితిలో ఉందని, ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేకపోతున్నామంటూ ఏడుస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో ఇలాంటి పరిస్థితులు ఉన్నప్పుడు హామీలు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీల్లో ఏవీ అమలు కాలేదన్నారు. వంద రోజుల్లో అమలు చేస్తామంటూ గొప్పలు చెప్పిన

మిగతా 4లో...

## మెరుగుపడిన కేసీఆర్ ఆరోగ్యం
**ఆసుపత్రి నుంచి డిశ్చార్జి**



**హైదరాబాద్, జూలై 5:** తీవ్ర జ్వరంతో అస్వస్థతకు గురై యశోద ఆసుపత్రిలో చేరిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆరోగ్యం మెరుగుపడింది. శనివారం ఉదయం 11.30 గంటల సమయంలో ఆయన ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. హైదరాబాద్‌లోని నందినగర్‌లో ఉన్న తన నివాసానికి వెళ్లారు. ఆ సమయంలో కేసీఆర్ వెంట ఆయన సతీమణి శోభ, బీఆర్ఎస్ నేతలు హరీశ్‌రావు, సంతోష్ రావు ఉన్నారు. అంతకుముందు ఎమ్మెల్సీ కవిత ఆస్పత్రికి వచ్చి.. కేసీఆర్ ఆరోగ్యం గురించి వాకబు చేశారు. వారం పాటు విశ్రాంతి తీసుకున్న తర్వాత కేసీఆర్‌కు మరోసారి వైద్య పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుందని వైద్యులు తెలిపినట్లు సమాచారం. కేసీఆర్ ఈ నెల 3వ తేదీన యశోద ఆసుపత్రిలో చేరిన విషయం తెలిసిందే. రక్తంలో షుగర్ నిల్వలు అధికంగా ఉన్నాయని, సోడియం తక్కువగా ఉందని పరీక్షల్లో తేలటంతో వైద్యులు ఆయనకు చికిత్స అందించారు.




## దేశ రక్షణ మరింత
# బలోపేతం
- **సిద్ధమవుతున్న 12 హైపర్‌సోనిక్ మిసైళ్లు.. అభివృద్ధి చేస్తున్న డీఆర్‌డీవో**
- **ఇప్పటికే విజయవంతంగా పరీక్షలు**
- **2030 కల్లా మోహరించేలా చర్యలు**
- **దాడి చేసే మిసైళ్లతో పాటు రక్షణ వ్యవస్థ కూడా..**
- **స్క్రామ్‌జెట్ ఇంజిన్‌తో అగ్రదేశాల సరసన**
- **వేగంగా రూపొందుతున్న ఆయుధాలు**

4 లో..

**న్యూఢిల్లీ, జూలై 5:** అత్యాధునిక ఆయుధాలతో దేశ రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి భారత్ సిద్ధమవుతోంది. డీఆర్‌డీవో ఆధ్వర్యంలో వివిధ రకాల 12 హైపర్‌సోనిక్ మిసైళ్లు రెడీ అవుతున్నాయి. దాడి చేయడం, రక్షణ సామర్థ్యాలపై దృష్టి పెట్టడం లక్ష్యంగా ఈ హైపర్‌సోనిక్ మిసైల్ టెక్నాలజీని వేగంగా అభివృద్ధి చేస్తున్నారు. ప్రాజెక్టు విష్ణులో ఈ మిసైళ్ల తయారీని ప్రధానంగా చేపట్టారు. వీటితో పాటు మరిన్ని అత్యాధునిక ఆయుధాలను కూడా అభివృద్ధి చేస్తున్నారు. వీటిలో ఓ హైపర్‌సోనిక్ గ్లైడ్ వెహికిల్ (హెచ్‌జీవీ), హైపర్‌సోనిక్ క్రూజ్ మిసైల్స్, హైపర్‌సోనిక్ మిసైల్ డిఫెన్స్ సిస్టమ్స్ ఉన్నాయి. వీటిని అభివృద్ధి చేయడంలో ప్రధాన లక్ష్యం.. అత్యంత వేగవంతమైన దాడి సామర్థ్యాలలో స్వావలంభన సాధించడం, అలాగే ఇలాంటి సాంకేతిక పరిజ్ఞానం వాడే శత్రువులను ఎదుర్కోవడానికి బలమైన రక్షణ వ్యవస్థను అభివృద్ధి చేయడం అని నిపుణులు చెబుతున్నారు. 2024 నవంబరులో డీఆర్‌డీవో తొలి హైపర్‌సోనిక్ మిసైల్ పరీక్షను నిర్వహించడం ఓ మైలురాయిగా అభివర్ణిస్తున్నారు. దేశీయ స్క్రామ్‌జెట్ ఇంజిన్ అభివృద్ధిలో ఇదో ఘన విజయంగా నిలిచింది. దీంతో స్క్రామ్‌జెట్ హైపర్‌సోనిక్ వ్యవస్థలను అభివృద్ధి చేసిన అమెరికా, రష్యా, చైనా సరసన భారత్ నిలిచింది. దీర్ఘశ్రేణి హైపర్‌సోనిక్ క్రూయిజ్ మిసైల్ సామర్థ్యం ఉన్న శక్తిమంతమైన దేశాల్లో మనదేశం ఒకటిగా నిలిచింది.



# 8న ప్రెస్‌క్లబ్‌కు వస్తా..
## ఎమ్మెల్యేలతో కలిసి రా
- **రైతులకు ఎవరేం చేశారో చర్చించడానికి రెడీ - నీ స్థాయికి నేను చాలు.. కేసీఆర్ అవసరం లేదు**
- **మా హయాంలో పూర్తయిన నియామకాలను - నీవని చెప్పుకోవడానికి సిగ్గు లేదా?: కేటీఆర్**

**హైదరాబాద్, జూలై 5:** "వందా.. వాని బొందా..!? 100 అసెంబ్లీ సీట్లు రావాలంటే ప్రజలు ఓటెయ్యాలి. రేవంత్‌కు ఎవరు ఓటేస్తారు? ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ అమలు చేయనందుకు దళితులు, గిరిజనులు ఓట్లేయాలా? రూ.4000 పింఛను ఇవ్వనందుకు ముసలివాళ్లు ఓట్లేయాలా? రెండు లక్షల ఉద్యోగాలు ఇవ్వనందుకు నిరుద్యోగులు ఓట్లేయాలా? నెలకు రూ.2500 ఇవ్వనందుకు ఆడబిడ్డలు ఓటు వేయాలా? రైతు బంధు ఎగ్గొట్టినందుకు రైతులు ఓట్లు వేయాలా? చచ్చిపోతున్న ఆటో డ్రైవర్లు నీకు ఓటు వేయాలా?" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. తెలంగాణ భవన్‌లో శనివారం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. "రైతులకు ఎవరెవరు ఏం చేశారో చర్చిద్దామన్న రేవంత్ రెడ్డి చాలెంజ్‌ను స్వీకరిస్తున్నా. రేవంత్‌కు 72 గంటల ప్రిపరేషన్ టైం ఇస్తున్నా. 8న ఉదయం 11 గంటలకు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ వస్తా. నీవు కూడా నీ ఎమ్మెల్యేలతో కలిసి రా.. మీడియా ముందే చర్చిద్దాం" అని సవాలు విసిరారు. రేవంత్ స్థాయికి కేసీఆర్ అవసరం లేదని, తాను సరిపోతానని అన్నారు.

మిగతా 4లో...

## గల్లీ లీడర్‌లా ఖర్గే వ్యాఖ్యలు: కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, జులై 5:** ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యలు ఢిల్లీ లీడర్‌లా కాకుండా గల్లీ లీడర్‌లా ఉన్నాయని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి అన్నారు. బీజేపీపై ఆయన చేసిన అనుచిత, అసభ్యకర వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. తన స్థాయి మరచి ఖర్గే విమర్శలు చేశారని మండిపడ్డారు. 80 ఏళ్ల వయస్సు గల ఖర్గే ఈ స్థాయికి దిగజారుతారని ఎవరూ ఊహించలేదు. 'ఈ వ్యాఖ్యలు మీ సొంతమా? లేక ఎవరైనా ఇచ్చిన స్క్రిప్ట్ చదివారా?' అని ఖర్గేను ప్రశ్నించారు. కాంగ్రెస్ చేసిన పాపం వల్లే పీవోకే పాక్ పరమైందని ఆరోపించారు. వరుస వైఫల్యాలతో కాంగ్రెసలో అసహనం నెలకొంద న్నారు. రాజ్యాంగ పీఠికలోని సెక్యులర్, సోషలిస్టు పదాల విషయంలోనూ ఖర్గే ప్రజలను తప్పుదోవ పట్టించారని శనివారం ఒక ప్రకటనలో కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

భారత సంతతి ప్రజలకు
## ఓసీఐ కార్డులు
- **ఆరో తరం వరకు ఉదారంగా ఇస్తాం**
- **ట్రినిడాడ్, టుబాగో పర్యటనలో మోదీ**

**పోర్ట్ ఆఫ్ స్పెయిన్, జూలై 5:** ట్రినిడాడ్, టుబాగో దేశంలో నివసిస్తున్న భారత సంతతి ప్రజల్లో ఆరో తరం వారికి కూడా ప్రవాస భారతీయ పౌరసత్వ(ఓసీఐ) కార్డులు ఇవ్వనున్నట్లు ఆ దేశ పర్యటనలో ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం ప్రకటించారు. ద్వీప దేశమైన ట్రినిడాడ్, టుబాగోలో 40 శాతం మంది భారత సంతతి వారే. అయితే వీరంతా బ్రిటీషు వారి పాలనా కాలంలో అక్కడికి వెళ్లారు. దీంతో ప్రస్తుతం వారి వద్ద ఎటువంటి భారతీయ గుర్తింపు కార్డులు లేవు. దీన్ని దృష్టిలో ఉంచుకుని మోదీ ఈమేరకు ప్రకటించారు. కాగా ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో భారత శాశ్వత సభ్యత్వానికి ట్రినిడాడ్, టుబాగో పూర్తి మద్దతు ప్రకటించింది. ఈమేరకు రెండు దేశాలు శనివారం ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. ప్రధాని నరేంద్ర మోదీ.. ట్రినిడాడ్, టుబాగో ప్రధాని కమ్లా పెర్సాద్ బిసెస్సర్ మధ్య జరిగిన చర్చల్లో రెండు దేశాల మధ్య ఆరు అంశాలపై ఒప్పందాలు జరిగాయి. రక్షణ, వ్యవసాయం, ఆరోగ్యం, డిజిటల్ సాంకేతికత, ఏకీకృత చెల్లింపుల వంటి వాటిలో సహకరించుకోవాలని నిర్ణయించారు. ఆ దేశ మహిళా క్రికెటర్లకు భారత్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు మోదీ ప్రకటించారు.



# మెరుగైన వైద్య సేవలను అందించాలి

## హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



**తొలి సమయం వరంగల్ జూలై 5**

హనుమకొండ: పరకాల సామాజిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే పేషెంట్స్ కు మెరుగైన వైద్య సేవలు అందించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు.శనివారం హనుమకొండ జిల్లా పరకాల లోని సామాజిక ఆరోగ్య కేంద్రం (సి.హెచ్.సి)ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా క్షయ వ్యాధి కేసుల గుర్తింపు, ఓపీ సేవలు, చికిత్సకు అందుబాటులో ఉన్న మందులు, ఎక్స్ రే పనితీరును గురించి సీహెచ్సీ సూపరింటెండెంట్ డాక్టర్ గౌతమ్ చౌహాన్, వైద్యులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఓపి వివరాలు నమోదు చేసిన రికార్డుతో పాటు ఫార్మసీ ని తనిఖీ చేశారు. అదేవిధంగా గర్భిణులకు అందిస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రంలోని ఇతర విభాగాలను పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవల గురించి వైద్యులు, సిబ్బందికి జిల్లా కలెక్టర్ పలు సూచనలు చేశారు.అనంతరం మీడియా ప్రతినిధులు అడిగిన పలు ప్రశ్నలకు జిల్లా కలెక్టర్ సమాధానమిచ్చారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్క్రీనింగ్ ఎలా చేస్తున్నారని పరిశీలించినట్లు తెలిపారు. ఓపి పేషంట్ల నమోదు, ఆరోగ్య కేంద్రం నిర్వహణ, మందులకు సంబంధించిన రికార్డులను పరిశీలించినట్లు చెప్పారు. ఆరోగ్య కేంద్రంలో చిన్నచిన్న లోపాలను సవరించుకోవాలని సూచించినట్లు పేర్కొన్నారు. ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు మెరుగ్గా ఉన్నాయని అన్నారు. వారం రోజుల్లో మరోసారి ఆరోగ్య కేంద్రం సందర్శనకు రానున్నట్లు పేర్కొన్నారు. అనంతరం పరకాలలో నూతనంగా నిర్మిస్తున్న వంద పడకల ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. పనుల పురోగతి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. నూతన ఆసుపత్రి నిర్మాణ పనులు త్వరగా పూర్తయ్యే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఈ సందర్భంగా టీబీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హిమబిందు, ఎన్ సి డి ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అహ్మద్, ఆర్ఎంఓ డాక్టర్ బాలకృష్ణ, డిఈ రాజశేఖర్, ఏఈ నాగరాజు, వైద్యులు,సిబ్బంది పాల్గొన్నారు.

# అవయవ దానం పై ప్రజల్లో అవగాహన పెరగాలి

## జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**తొలి సమయం వరంగల్ జూలై 5**

అవయవ దానంపై ప్రజల్లో .అవగాహన పెరగాలని మరొక వ్యక్తికి పునర్జన్మను ఇవ్వడానికి జీవన్ దాన్ మహాదానమని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు.శనివారం తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల అసోసియేషన్ వరంగల్ శాఖ, టీ 9 ఛానల్ సంయుక్త ఆధ్వర్యంలో వరంగల్ పట్టణంలోని ఆబ్నూస్ ఫంక్షన్ హాల్ లో నేత్ర అవయవ శరీర దానం పై ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, ముఖ్య అతిధిగా పాల్గొని, అతిధులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ అవయవ దానం చేసేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలన్నారు. సమాజానికి మంచి చేయాలనే ఆలోచన కలగాలని, అవయవ దానంతో మరికొందరి జీవితాలలో వెలుగు నింపవచ్చునని, దీనిపై ప్రజల్లో ఇంకా అవగాహన కలగాలని చెప్పారు. అవయవదానం చేసిన వారు మహాత్ములని, చిరంజీవులుగా మిగిలిపోతారని సూచించారు.ప్రభుత్వం ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజ్ ఏర్పాటు చేసిన నేపథ్యంలో వైద్య విద్యార్థులు మానవ శరీరం పై ఫిజియాలజీ, అనటమి పరీక్షలు ఆచారాత్మకంగా చేయుటకు మానవ మృత దేహల అవసరం ఎంతో ఉందని, మానవ మృత దేహాలు దానం చేయడం వల్ల వీటిని వినియోగించి మంచి వైద్యులను తయారు చేయ వచ్చునని కలెక్టర్ తెలిపారు. మనిషి చనిపోతే ఇక తిరిగి రారు, ఇక లేరు అనుకుంటారని, కానీ ఒక బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి నుండి 8 మందికి కొత్త జీవితాన్ని ఇస్తుందన్నారు. వేల మంది రోగులు తమకు అవసరమైన అవయవాలు సరైన సమయంలో లభించకపోవడంతో మరణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి రక్తదానం చేసే విధంగానే ప్రతి ఒక్కరూ అవయవనానికి సైతం ముందుకు రావాలని కోరారు. జీతే జీతే రక్తదానం జాతే జాతే నేత్రదాన్, దేహ్ దాన్ చేయాలన్నారు. రోగిని బ్రతికించే వాళ్ళు డాక్టర్లు దేవతలైతే అవయవ దానం చేసిన వారు దైవదూతలన్నారు అవయవ దానం పై అవగాహన కార్యక్రమాలను ఉధృతం చేయాలని కలెక్టర్ కోరారు. దాతలకు అవగాహన కల్పిస్తున్న వాలంటీర్లు, నిర్వాహకులు, అధికారులు వైద్య సిబ్బందికి కలెక్టర్ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్లు, మాట్లాడుతూ అవయవ దానం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. తాము కూడా వైద్య విద్యార్థు లుగా విద్యానభ్య సించిన సమయంలో మానవ మృతదేహాలపై ప్రాక్టికల్ గా పరీక్షలు నిర్వహించడం వల్ల ఈరోజు సమాజంలో రోగులకు పరిపూర్ణంగా శస్త్ర చికిత్సలు చేయగలుగు తున్నామన్నారు. నేటి వైద్య విద్యార్థు లకు కూడా ప్రాక్టికల్ గా శస్త్ర చికిత్సలు



నేర్పడానికి మానవ పార్థివ దేహాలు ఎంతో అవసరమని అన్నారు.అవయవ దానం చేయుటకు అంగీకరించడం,బ్రెయిన్డెడ్ అయిన వారి శరీరాలను ముందుకు వచ్చి మెడికల్ కాలేజీలకు ఇవ్వడం మంచి పరిణామం అని,దీని ద్వారా గొప్ప డాక్టర్లను తీర్చిదిద్దడం తో పాటు దైవం కూడా అనుగ్రహిస్తుందని తెలిపారు.ఈ సందర్భంగా అవయవ దానం చేయుటకు అంగీకరించిన వారికి శాలువాలతో కలెక్టర్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ సాంబశివరావుకేఎంసీ, ఎంజీఎం నర్సంపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల సూపరింటెండెంట్ లు డాక్టర్ రామ్ కుమార్ రెడ్డి డాక్టర్ చిలుక మురళి డాక్టర్ మోహన్ దాస్, డాక్టర్ కూరపాటి రమేష్, ప్రభుత్వ సూపర్డెంట్ డాక్టర్ భరత్ కుమార్, మైదం రాజు తహసీల్దార్ ఇక్బాల్, నిర్వాహకులు, వాలంటీర్లు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ మైనారిటీ గురుకుల కళాశాలలో వంటమనుషులు , దోబీ , స్వీపర్ , ఎలక్ట్రీషియన్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం.



**తొలి సమయం వరంగల్ జూలై 5**

దామెర మండలంలోని మైనారిటీ గురుకుల పాఠశాల మరియు కళాశాలలో వంటమనుషులు-1, దోబీ-1, స్వీపర్-1 మరియు ఎలక్ట్రీషియన్-1 పోస్టులను భర్తీ చేయుటకు అర్హతగల అభ్యర్థులనుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రమేష్ లాల్ హట్కర్ ఒక ప్రకటనలో తెలిపారు .ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులను బయోడేటాతోపాటు ఆధార్ కార్డు నకలు , రెండు ఫోటోలను నేరుగా పాఠశాలలో ఈ నెల 6 నుండి 10వ తేదీ వరకు , పని దినాలలో ఉదయం 10 గంటలనుండి సాయంత్రం 4 గంటలలోపు సమర్పించాలని కోరుతూ , ఎలక్ట్రీషియన్ పోస్టుకు ప్లంబింగ్ నైపుణ్యం కూడా ఉండాలని తెలిపారు .సంప్రదించాల్సిన చిరునామా తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాల మరియు కళాశాల , SBIT క్యాంపస్ , శైలానిబాబా దర్గా ప్రక్కన , ఒగ్లాపూర్ వివరాలకు 9949300368, 9573969991, 7780167736, 7995057981 నంబర్లకు సంప్రదించగలరు.

## ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులపై కలెక్టర్ సమీక్ష



తొలి సమయం వరంగల్ జూలై 5

హనుమకొండ: ప్రభుత్వ విద్యాసంస్థల్లో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులపై విద్య శాఖ, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కేజీబీవీ, ప్రభుత్వ పాఠశాలల్లో మొదటి, రెండో దశలో చేపట్టిన అభివృద్ధి పనులు, వాటి పురోగతి గురించిన వివరాలను డీఈవో వాసంతి, ఇంజనీరింగ్ అధికారులు జిల్లా కలెక్టర్ కు వివరించారు.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ జిల్లాలోని తొమ్మిది కేజీబీవీ పాఠశాలల్లో పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులను చేయడంపై వారం రోజుల్లోతెలియజేయాలన్నారు. విద్యార్థులకు అవసరమైన వివిధ సదుపాయాలను పాఠశాలలకు కేటాయించేందుకు ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీ, కళాశాలలు, గురుకులాలు,అంగన్వాడీ కేంద్రాలలో తాగునీరు, విద్యుత్, టాయిలెట్స్, తదితర అభివృద్ధి పనులను పూర్తిచేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులకు టెండర్లు పిలవాలన్నారు. ఈ సమావేశంలో ఈఈ నరేందర్ రెడ్డి, డిఈ రవీందర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోదాములను పరిశీలించిన కలెక్టర్ డాక్టర్ సత్య శారదా

**తొలి సమయం వరంగల్ జూలై 5**



వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో జిల్లా గోదాములను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా, ఆదనపు కలెక్టర్ సంధ్యారాణి తో కలసి శనివారం పరిశీలించారు.కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి నెలకు ఒకసారి నిర్వహించే సాధారణ తనిఖీలలో భాగంగా ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డు లోని జిల్లా ఈవీఎం గోదాములను కలెక్టర్ తనిఖీ చేసి,ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ గోదాంలకు సంబంధించిన రికార్డులు, కట్టుదిట్టమైన భద్రత చర్యలు, సీసీ కెమెరాల నిరంతర పర్యవేక్షణ గురించి వివరాలను అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.ఈ తనిఖీలో తహసీల్దార్ ఇక్బాల్, నాయబ్ తహసీల్దార్ రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

## మట్టెవాడ పోలీస్ స్టేషన్ పరిధిలో నివసించే ప్రజలందరికీ విజ్ఞప్తి

### ప్రజలకు విజ్ఞప్తి మట్టెవాడ పోలీస్ స్టేషన్ సిఐ గోపి

**తొలి సమయం వరంగల్ జూలై 5**



మట్టెవాడ పోలీస్ స్టేషన్ పరిధిలో నివసించే ప్రజలందరికీ విజ్ఞప్తిమీ పరిసరాల్లో ఎక్కడైనా గొడవ, ఘర్షణ, శాంతిభద్రతలకు భంగం కలిగే సంఘటనలు జరిగినట్లు సమాచారం లభిస్తే, దయచేసి వెంటనే డయల్ 100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించగలరు.మీరు ఇచ్చే సమాచారం మా చర్యలకు మార్గదర్శకమవుతుంది.ప్రజలందరూ చట్టాన్ని గౌరవించి, చట్టాన్ని చేతిలోకి తీసుకోకుండా, పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వగలరు.మీరు సమాచారం ఇచ్చిన వెంటనే స్పందించి, సమస్యలను అదుపులోకి తెచ్చేందుకు మేము మీకు పూర్తిస్థాయిలో సహకరిస్తాము.ఇలా చురుకైన స్పందనతో సంఘటనలు పునరావృతం కాకుండా నిరోధించవచ్చు.సమాజ శాంతి కోసం పోలీసుల సహకారంతో ముందడుగు వేయండి.

## బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్ లో భారీ చేరికలు

### కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే నాయిని

**తొలి సమయం వరంగల్ జూలై 5**



కాంగ్రెస్ పార్టీని నమ్ముకున్న ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుంది ఎమ్మెల్యే వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని 30వ డివిజన్ ప్రెసిడెంట్ రమేష్ మరియు నాయకులు బొంత సారంగం గారి ఆధ్వర్యంలో పార్టీ నుండి నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరారు వీరిని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గారు బాలసంద్రం లోని తన క్యాంపు కార్యాలంలో కండువా కప్పి ఆహ్వానించారు,ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా పాలన నచ్చి ఆకార్షితులై కాంగ్రెస్ లో చేరుతున్న ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తానని, ఎవరికి ఎలాంటి సమస్య వచ్చిన తనవద్దకు రావాలని ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని అన్నారు.కాంగ్రెస్ పార్టీని నమ్ముకున్న ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని అన్నారు.అంతకు ముందు ప్రజా ప్రభుత్వంలో రేవంత్ రెడ్డిగారి పాలన నచ్చి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నామని %దీ=ూ% నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో బొంత సారంగం, డివిజన్ అధ్యక్షులు వల్లెపు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ జెండా ఎగరవేయాలని

### బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు

**తొలి సమయం తొర్రూరు జూలై 5**



తొర్రూరు మండలం వెంకటాపురం మరియు ఫతేపురం ఎంపీటీసీ పరిధి గ్రామలలో బిఆర్ఎస్ జెండా ఎగరవేయాలని బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు మరియు మండల ఇన్చార్జ్శ్రీరామ్ సుధీర్మాట్లాడుతూ జిమాజీ మంత్రివర్యులు ఎర్రబెల్లి దయాకర్ రావు చేసిన అభివృద్ధి కనిపిస్తుందితప్ప కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి చేసింది ఏమీలేదు అన్నారు. ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చారన్నారు.రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన సంక్షేమ పథకాలలో కోతలు ఎగవేతలు తప్ప చేసింది ఇచ్చింది శూన్యం అన్నారు..ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎన్నికలు ఎప్పుడు వచ్చినా తగిన బుద్ధి చేపటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.రైతు బంధు రెండు పంటలకు ఎగనామం పెట్టారని రైతు రుణమాఫీ 60% రైతులకు కూడా జరగలేదని తెలిపారు.మహిళలకు తులం బంగారం , 2500 రూపాయలు అలాగే స్కూటీలు ఇస్తానని మోసం చేసారు. భూమి లేని పేదలకు 12000 ఇస్తామని ప్రజలను మభ్యపెట్టారని తెలిపారు. మాజీ మంత్రివర్యులు ఎర్రబెల్లి దయాకర్ రావు మొదలు పెట్టిన అభివృద్ధి పనులు ఎందుకు పూర్తి చేయలేదని స్థానిక ఎంఎల్ఏ ప్రజలకు సమాధానం చెప్పాలని కోరారు..ఇందిరమ్మ ఇండ్ల పేరుతో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు లబ్ధి చేకూరింది.తప్ప పేద ప్రజలకు వచ్చింది శూన్యం అన్నారు...ఈ కార్యక్రమంలో తొర్రూర్ మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ ఎన్నమనేని శ్రీనివాసరావు, తొర్రూర్ తొర్రూరు మండల సెక్రెటరీ నల్లమాస ప్రమోద్ కుమార్, తొర్రూరు మండల సీనియర్ నాయకులు కాలు నాయక్, ఎస్.కె అంకుష్ , ధరావత్ జై సింగ్, శీలం లింగన్న గౌడ్, పయ్యావుల రామ్మూర్తి పెద్ద బోయిన రామ్మూర్తి , ధరావత్ బాలు, ఆయా గ్రామ పార్టీ అధ్యక్ష కార్యదర్శులు మాజీ సర్పంచ్ ఎంపీటీసీలు ఉపసర్పంచ్లు వార్డ్ మెంబర్లు యువత ,సోషల్ మీడియా నాయకులు పాల్గొన్నారు.

# సిపిఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయండి

## సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎస్.ఎండి ఫయాజ్..



**నాగర్ కర్నూల్ జులై 5 :**

భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ నాగర్ కర్నూల్ జిల్లా మూడవ మహాసభలను ఆగస్టు ఒకటి రెండో తేదీలలో నిర్వహించబడుతున్నాయని ఈ మహాసభలను విజయవంతం చేయాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎస్.ఎండి ఫయాజ్ వార్ల వెంకటయ్య జిల్లా కార్యవర్గ సభ్యులు కొమ్ము భరత్ సిపిఐ కల్వకుర్తి నియోజకవర్గ ఇంచార్జి కార్యదర్శి పులిజాల పరశురాములు సిపిఐ జిల్లా నాయకులు సిహెచ్ శ్రీనివాసులు అశోక్ గౌడ్ దార దాసు పిలుపునిచ్చారు. శనివారం మధ్యాహ్నం కల్వకుర్తి పట్టణం లోని సిపిఐ కార్యాలయం లో మహాసభల కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆగస్టు ఒకటో తేదీన కల్వకుర్తి పట్టణంలో భారీ ప్రదర్శన గొప్ప బహిరంగ సభను నిర్వహిస్తున్నామని ఈ బహిరంగ సభ కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు మాజీ శాసన సభ్యులు చాడ వెంకట్ రెడ్డి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాల్ నరసింహ హాజరవుతారని తెలిపారు. ఆగష్టు రెండో తేదీన కల్వకుర్తి పట్టణంలోని శుభం ఫంక్షన్ హాల్ లో ప్రతినిధుల సభ నిర్వహించబడుతుందని ఈ మహాసభల విజయవంతం కోసం పార్టీ సభ్యులు ప్రజలు అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఐ శతాబ్ది ఉత్సవాలు దేశవ్యాప్తంగా నిర్వహించబడుతున్న ఈ తరుణంలో ఈ మహాసభలు జరగడం చారిత్రక మైనటువంటి అంశంగా తెలిపారు. 100 సంవత్సరాల చరిత్ర కలిగిన ఏకైక విప్లవ పార్టీగా సిపిఐ కి ఎంతో ఘన చరిత్ర ఉందని తెలిపారు. ఈ మహాసభలకు భారీగా ప్రజలు తరలిరావాలని వారు కోరారు.

# క్షత్రియ సమాజ్ సంఘ అభివృద్ధికి కృషి

## ఘనంగా క్షత్రియ సమాజ్ ప్రమాణ స్వీకారం వేడుక



**కోరుట్ల,జులై 5 :**

స్థానిక పట్టణంలోని సోమవంశ సహసర్జన క్షత్రియ సమాజ్ (పట్కారి) సంఘ కార్యాలయంలో నూతన సభ్యుల ప్రమాణం స్వీకారం ఘనంగా నిర్వహించారు. కాగా సోమ వంశ సహసర్జన క్షత్రియ సమాజ్ సంఘం అధ్యక్షుడిగా ధోండి నందలాల్,ప్రధాన కార్యదర్శి గా శికారి గోపికృష్ణ, కోశాధికారిగా జమన్ జ్యోతి రాజేంద్రప్రసాద్ లు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎన్నికైన నూతన సభ్యులకు సంఘ సభ్యులు శాలువతో ఆత్మీయ సన్మానం చేసి అభినందనలు తెలిపారు. అనంతరం అధ్యక్షులు మాట్లాడుతూ... సంఘ అభివృద్ధికి మీ అందరి సహాయ సహకారాలతో నిరంతరం కృషి చేస్తానని అన్నారు.ఇట్టి కార్యక్రమంలో మాజీ శాసన సభ్యులు శికారి విశ్వనాథం, శికారి విజయ్, గంటెడి శ్రీనివాస్, జమన్ జ్యోతి శ్రీనివాస్, బచ్చావల సంజీవ్, బదాం పురుషోత్తం, చావ్ల లక్ష్మీనారాయణ, బచ్చువాల కిషన్, గంగా మోహన్, బచ్చువాల శ్రీనివాస్ పలువురు పాల్గొన్నారు.

# దేశ రక్షణ మరింత...

(మొదటిపేజీ తరువాయి)

మాక్ 5 (ధ్వని కన్నా ఐదు రెట్లు వేగం) కన్నా ఎక్కువ వేగంతో ప్రయాణించే సామర్థ్యం ఉన్న ఆయుధాలను హైపర్‌సోనిక్‌గా పేర్కొంటారు. ప్రస్తుతానికి ఇలాంటి హైస్పీడ్ క్రూయిజ్ మిసైళ్లను అడ్డుకునే రక్షణ వ్యవస్థ ఏదీ ప్రపంచంలో లేదు. అలాంటి అత్యాధునిక 12 హైపర్‌సోనిక్ ఆయుధాలను ఆర్మీ, నేవీ, వాయుసేన కోసం డీఆర్‌డీవో అభివృద్ధి చేస్తోంది. దీనిలో మొట్టమొదటగా ఎక్స్‌టెండెడ్ ట్రాజెక్టరీ లాంగ్ రేంజ్ హైపర్‌సోనిక్ క్రూయిజ్ మిసైల్(ఈటీ-ఎల్‌డీహెచ్‌సీఎం)ను ప్రాజెక్టు విష్ణులో భాగంగా రూపొందిస్తున్నారు. స్క్రామ్‌జెట్ ఇంజిన్‌తో మాక్ 8 స్పీడ్‌ను అందుకునేలా దీనికి రూపకల్పన చేశారు. 2,500 కిలోమీటర్ల వరకు ఉన్న పరిధిలోని లక్ష్యాలను ఇది ఛేదించగలదని చెబుతున్నారు. 2030 కల్లా దీనిని సాయుధ బలగాల అమ్ములపొదిలో ప్రవేశపెట్టే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఇక మరో ప్రధానమైన ఆయుధం హెచ్‌జీవీ. స్క్రామ్‌జెట్ ఇంజిన్‌తో రూపొందించిన ఈ మిసైల్‌ను నవంబరు 2024లో డీఆర్‌డీవో పరీక్షించింది. యుద్ధనౌకలపై దాడి చేసేందుకు రూపొందించిన ఈ మిసైల్ రేంజ్ 1,500 కిలోమీటర్లు. 2030 కల్లా దీనిని కూడా ప్రవేశపెట్టనున్నారు. ఇదే సమయంలో ప్రాజెక్టు కుశ కింద ప్రత్యేక హైపర్‌సోనిక్ రక్షణ వ్యవస్థను అభివృద్ధి చేయడానికి భారత్ కృషి చేస్తోంది. దాడి చేసే ఆయుధాలను రూపొందిస్తున్న సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా ఈ రక్షణ వ్యవస్థను అభివృద్ధి చేయడానికి సంకల్పించారు.

**హైపర్‌సోనిక్ డ్రోన్లు కూడా..**

యుద్ధ విమానాలు, నౌకల నుంచి కూడా ప్రయోగించే హైపర్‌సోనిక్ మిసైళ్లను డీఆర్‌డీవో అభివృద్ధి చేస్తోంది. జలాంతర్గాముల నుంచి ప్రయోగించే వర్షన్ కూడా ప్రతిపాదనలో ఉంది. అంతేకాకుండా హైపర్‌సోనిక్ డ్రోన్లు, డెకాయ్‌లు కూడా రూపొందిస్తోంది. 2030 కల్లా సమగ్ర హైపర్‌సోనిక్ మిసైల్ అభివృద్ధి కార్యక్రమాన్ని పూర్తి చేయాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుంది.

# అర్హులైన కళాకారులందరికీ పింఛన్లు: జూపల్లి

**హైదరాబాద్, జూలై 5:**

రాష్ట్రంలో అర్హులైన వృద్ధ కళాకారులందరికీ పింఛన్లు ఇస్తామని పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. కళాకారులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని పేర్కొన్నారు. కళాకారుల సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. శనివారం రవీంద్రభారతిలో మంత్రిని మాజీ ఎమ్మెల్యే మృత్యుంజయం ఆధ్వర్యంలో పలువురు కళాకారులు కలిసి తమ సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అర్హులైన వృద్ధ కళాకారులందరికీ పింఛను ఇచ్చే అంశంపై సీఎంతో చర్చించి త్వరలో నిర్ణయం తీసుకుంటామని మంత్రి చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'స్వచ్ఛదనం పచ్చదనం' కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో ఈ ఏడాది 7 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి సీతక్క తెలిపారు. సచివాలయంలో శనివారం సంబంధిత అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశం చేశారు. గత ఏడాదిలో 6.90 కోట్ల మొక్కలు నాటామని, వాటిలో ఎన్ని బతికాయో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు.

# నిరుద్యోగులు సంఘటితంగా పోరాడాలి

## కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఖాళీగా ఉన్న ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలి

### సూర్యాపేట నిరుద్యోగ విద్యార్థి మహాసభలో

### బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం చైర్మన్, విశ్రాంత ఐఏఎస్ చిరంజీవులు





**సూర్యాపేట. జులై 5 :**

నిరుద్యోగులు సంఘటితంగా శాంతియుతమైన పోరాటాల ద్వారానే తమ సమస్యలను పరిష్కరించుకోవాలని, ఖాళీగా ఉన్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ రంగ ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలని బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం చైర్మన్, విశ్రాంత ఐఏఎస్ చిరంజీవులు అన్నారు, అనుములపురి జనార్దన్ ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పద్మశాలి భవన్ లో నిర్వహించిన నిరుద్యోగ విద్యార్థి మహాసభ సమావేశంలో సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన విశ్రాంతం ఐఏఎస్ చిరంజీవులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ లోని రెండు లక్షల ఉద్యోగాల సాధనకై నిరుద్యోగులు సంఘటితం కావాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రోజురోజుకు నిరుద్యోగ సమస్య తీవ్రమవుతున్నందున రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెండు లక్షల ఉద్యోగులను తక్షణమే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో సూర్యాపేట ప్రాంతం ఎంతో చైతన్యవంతమైన పాత్ర పోషించిందని గతంలో తెలంగాణ మహాసభ ఇక్కడి నుంచే ప్రారంభమైందని, చెరుకు సుధాకర్, మారోజు వీరన్న, బండి యాదగిరి లాంటి వాళ్ళు ఈ ప్రాంతం వారేనని గుర్తు చేశారు. నిరుద్యోగ విద్యార్థి మహాసభ ఇక్కడి నుంచే నాంది పలకటం హర్ష నీయమన్నారు. ప్రభుత్వ, ప్రైవేటుపరంగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పనతో పాటు ఉపాధి కల్పనకు స్కిల్ డెవలప్మెంట్ కొరకు ఒక కమీషన్ ఏర్పాటు చేయాలని సూచించారు. నిరుద్యోగులకు న్యాయం జరగాలంటే రిటైర్మెంట్ కాల పరిమితిని 61 నుంచి 57 సంవత్సరాలకు తగ్గించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లేక, ఉపాధి అవకాశాలు లేక విలవిలాడుతున్నారని ఆక్షేపించారు. భవిష్యత్తులో బడుగు బలహీన వర్గాల ప్రభుత్వాలు వచ్చినప్పుడే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని మండల్ కమిషన్ ఓబీసీలకు 27శాతం రిజర్వేషన్లు కల్పించినప్పటికీ నేటి వరకు కేవలం 22 శాతం మాత్రమే ఓబీసీలు ఉద్యోగాలు పొందారని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగ జేఏసీ అధ్యక్షులు పాలకూరి అశోక్ గౌడ్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లోపే అన్ని ఖాళీలను భర్తీ చేస్తూ నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రంథాలయాల్లో పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే నిరుద్యోగ విద్యార్థులకు మధ్యాహ్నం భోజన సౌకర్యాన్ని, మౌలిక వసతులు కల్పించాలని ఈ సందర్భంగా తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన వ్యవస్థాపకులు సంజీవ్ నాయక్, తెలంగాణ ఉద్యమకారుడు పృథ్వీరాజ్ యాదవ్, చామకూర రాజు, కె వి గౌడ్, అవ్వారు వేణు, ఇంద్ర నాయక్, అర్జున్, దామోదర్ రెడ్డి, నరసింహ నాయక్,ఎల్, నాగేశ్వరరావు నాయక్,భద్రు,తదితరులు పాల్గొన్నారు.

# లైంగిక దాడుల బాధిత పిల్లలకు న్యాయం.. (మొదటిపేజీ తరువాయి)



**హైదరాబాద్, జూలై 5:** "న్యాయమంటే కేవలం శిక్షలు విధించడమే కాదు. బాధితుల జీవితానికి భరోసా కల్పించడం. లైంగిక దాడుల బాధిత చిన్నారులకు అవసరమైన రక్షణ, సమాజంలో తగిన గౌరవం కల్పించేలా చర్యలు తీసుకోవడమే కాదు.. వారు తమ బాల్యాన్ని తిరిగి పొందడానికి అందరూ ప్రయత్నించాలి" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. పిల్లలు, మహిళల రక్షణకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందన్నారు. సోషల్ మీడియా విషయంలో అందరూ అప్రమత్తంగా ఉండాలని, దానిని దుర్వినియోగం చేస్తున్న వారి పట్ల ఎలాంటి కరుణ చూపాల్సిన అవసరం లేదని, దోషుల విషయంలో కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.

లైంగిక దాడులకు గురైన చిన్నారుల రక్షణ, భద్రత విషయమై శనివారం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల సంస్థలో సదస్సు జరిగింది. సుప్రీం కోర్టు న్యాయమూర్తి, నల్సార్ అధ్యక్షుడు జస్టిస్ సూర్యకాంత్ ప్రారంభించిన ఈ సదస్సుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లైంగిక దాడుల బాధితులైన చిన్నారులకు అన్ని దశల్లో అండగా ఉంటామని, వారి బాల్యాన్ని మళ్లీ వారికి అందించడానికి అన్ని శాఖల సిబ్బంది మానవతా దృక్పథంతో పని చేయాలని కోరారు.ఇలాంటి విషయాల్లో అందరం కలిసికట్టుగా ముందుకు సాగుదామని న్యాయమూర్తులు, పోలీసు అధికారులు, బాలల సంక్షేమ కమిటీలు, ఇతర భాగస్వామ్య సభ్యులకు ఆయన విజ్ఞప్తి చేశారు. "న్యాయం అనేది కేవలం కోర్టుల్లోనే కాకుండా ప్రతి దశలోనూ చిన్నారులకు అందాలి. పోలీసు స్టేషన్ నుంచి బాలల సంక్షేమ కేంద్రాల వరకు అన్నిచోట్ల పిల్లలకు న్యాయం దక్కాలి. రక్షణ కల్పించాలి. బాలికలు, మహిళల రక్షణ కోసం ఇప్పటికే తెలంగాణలో భరోసా ప్రాజెక్టు అమల్లో ఉంది. దీనికి అనుసంధానంగా 29 కేంద్రాలు పనిచేస్తున్నాయి. వీటి ద్వారా పోలీసు సహాయమే కాకుండా న్యాయ, వైద్య, కౌన్సెలింగ్ సేవలూ అందిస్తున్నాం" అని వివరించారు.

హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తోన్న భరోసా కేంద్రం చైల్డ్ ఫ్రెండ్లీ కోర్టులను ప్రారంభించిందని, ఈ సేవలను అందిస్తున్న మొద టి రాష్ట్రంగా తెలంగాణ నిలుస్తోందని తెలిపారు. లైంగిక దాడులకు సంబంధించిన కేసులను వేగవంతంగా పరిష్కరించడమే కాకుండా ఆయా చిన్నారులకు సంపూర్ణ రక్షణ కల్పించి, వారిలో విశ్వాసాన్ని పెంపొందించి మళ్లీ సాధారణ జీవితానికి అలవాటు పడేలా ఈ కేంద్రాలు అన్ని రకాల చర్యలూ తీసుకుంటున్నాయని తెలిపారు. "పోక్సో, జువైనల్ చట్టాలు ప్రగతిశీల సాధనాలుగా పని చేస్తున్నాయి. అయితే, ఆచరణలో కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయి. బాధితులకు ఎలాంటి హాని కలిగించ కుండా, వారి భవిష్యత్తుకు, రక్షణకు సంపూర్ణ సహాయకారిగా ఈ చట్టాలు ఉండాలి" అని సూచించారు. చైల్డ్ పోర్నోగ్రఫీ కేసుల విషయంలో అత్యంత కఠినంగా వ్యవహరించాలని పోలీసు అధికారులకు నిర్దేశించారు. 'వాయిస్ ఫర్ ది వాయిసలెస్' అనే థీమ్‌తో తమ బాధను చెప్పుకోలేని వారికి రక్షణ కల్పించేందుకు ప్రస్తుత పరిస్థితుల్లో ఇలాంటి రాష్ట్రస్థాయి సమావేశం అవసరమని అంటూనే.. ఎంతో కీలకమైన అంశంపై ఈ సదస్సు నిర్వహించిన తెలంగాణ పోలీసులకు, ఇతర నిర్వాహకులకు ఆయన అభినందనలు తెలిపారు.

**పోక్సో కేసుల్లో 90 శాతం శిక్షలు: సీతక్క**

పోక్సో చట్టానికి సంబంధించి 90 శాతం కేసుల్లో నేరగాళ్లకు శిక్షలు వేయించేలా ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. చిన్నారులు, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలకు చాలావరకు గంజాయి లాంటి మత్తుమందులు కారణమవుతున్నట్లు తమ విచారణలో వెల్లడైందని, అందుకే తెలంగాణను 'డ్రగ్స్ ఫ్రీ రాష్ట్రం'గా మార్చడానికి సీఎం రేవంత్ రెడ్డి దృఢ నిశ్చయంతో ఉన్నారని ఆమె వివరించారు. మానవతా దృక్పథంతో వ్యవహరించాలని కోరారు. తెలంగాణ మహిళా భద్రతా విభాగం, మహిళా శిశు సంక్షేమశాఖ, రాష్ట్ర న్యాయ సేవా సాధికార సంస్థ సంయుక్తంగా ఈ సదస్సును ఏర్పాటు చేశాయి. సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, తెలంగాణ హైకోర్టు తాత్కాలిక చీఫ్ జస్టిస్ సుజోయ్ పాల్, డీజీపీ జితేందర్, మహిళా భద్రతా విభాగం అదనపు డీజీపీ చారు సిన్హా, యునిసెఫ్ భారత ప్ర తినిధి క్యాథినా తదితరులు సదస్సులో పాల్గొన్నారు.

**బాలల భద్రత జాతీయ బాధ్యత: జస్టిస్ సూర్యకాంత్**

బాలల భద్రత కేవలం చట్టపరమైన బాధ్యత మాత్రమే కాదని, నైతిక, జాతీయ బాధ్యత అని సుప్రీం కోర్టు న్యాయమూర్తి, నల్సార్ అధ్యక్షుడు జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. సదస్సులో ఆయన మాట్లాడుతూ.. చిన్నారులపై జరుగుతున్న లైంగిక దాడులకు సంబంధించి అశ్రద్ధ, వ్యవస్థాగత వైఫ ల్యం కేవలం నేరపరమైన లోపం మాత్రమే కాదని, బాల్యానికి చేస్తున్న తీవ్ర ద్రోహమని వ్యాఖ్యానించారు. తెలంగాణలోని భరోసా కేంద్రాలు చట్టపరంగానే కాకుండా వైద్య, మానసిక సంరక్షణను సమగ్రంగా అందించే జాతీయ బాలల రక్షణ ఫ్రేమ్ వర్క్‌ను సాకారం చేస్తున్నాయని ప్రశంసించారు. పోక్సో కేసుల సంఖ్య పెరుగుతుండడంపై హైకోర్టు తాత్కాలిక చీఫ్ జస్టిస్ సుజోయ్ పాల్ ఆందోళన వ్యక్తం చేశారు. పోక్సో కేసు నిందితుల్లో 98% కుటుంబ సభ్యులు, బంధువులు లేదా ఇరుగుపొరుగు ఉంటున్నారని తెలిపారు. ఇలాంటి కేసులను చూస్తున్న అన్ని శాఖల సిబ్బంది తమ వద్దకు వచ్చే బాధితుల విషయంలో సానుభూతి, సున్నితత్వంతో వ్యవహరించాలని సూచించారు.

# 8న ప్రెస్‌క్లబ్‌కు వస్తా.. (మొదటిపేజీ తరువాయి)

బనకచర్ల పేరుతో ఆంధ్రకు నీళ్లు పంపుతున్నారని, నిధులను ఢిల్లీకి పంపుతున్నారని, ఆయన తొత్తులు కొంతమందికి నియామకాలు ఇస్తున్నారని ఆరోపించారు. ఎరువులను పంచడం కూడా చేతగాని రేవంత్ రెడ్డి.. కేసీఆర్‌లాంటి నాయకుడితో చర్చకు సిద్ధపడితే జనం నవ్వుతున్నారని ఎద్దేవా చేశారు. ఇవాళ తెలంగాణవ్యాప్తంగా ఎరువులు, విత్తనాల కోసం రైతులు యుద్ధమే చేయాల్సి వస్తోందని, ప్రతి మండలంలో రైతులు ఎరువులు, యూరియా కోసం ధర్నాలు చేస్తున్న విషయం వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. కాంగ్రెసకు ఓటేస్తే మళ్లీ పాత రోజులు తీసుకొస్తామని అన్నారని, నిజంగానే ఆ పాత దుర్దినాలను రేవంత్ రెడ్డి తీసుకొచ్చారని దుయ్యబట్టారు. కరోనా సమయంలో దేశమంతా అతలాకుతలమవుతుంటే 7500 ధాన్యం కొనుగోలు కేంద్రాలను పెట్టి చివరి గింజ వరకు కొని రైతుల కడుపును కేసీఆర్ నింపారని, ఎక్కడ బోనస్ ఇవ్వాల్సి వస్తుందోనన్న భయంతో ఇవాళ మార్కెట్ యార్డులకు వచ్చిన ధాన్యాన్ని కొనకుండా పారిపోతున్నది రేవంత్ ప్రభుత్వమని మండిపడ్డారు. "రైతు భరోసాలో 39 వేల కోట్లు, రుణమాఫీలో రూ.38 వేల కోట్లను రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎగ్గొట్టింది. నాట్లు వేసేటప్పుడు కేసీఆర్ రైతుబంధు ఇస్తే.. ఓట్లు వేసేటప్పుడు మాత్రమే రేవంత్ రెడ్డి రైతు భరోసా ఇస్తున్నాడు. కోటీశ్వరులను చేస్తానన్న మాటల్ని ఆడబిడ్డలు నమ్మడం లేదు. నెలకు తమకి ఇస్తామన్న రూ.2500 ఎప్పుడు ఇస్తావో చెప్పాలని నిలదీస్తున్నారు. తమకి ఇస్తానన్న స్కూటీ ఏమైందని మా చెల్లెళ్లు ఎదురు చూస్తున్నారు. నిరుద్యోగ భృతి ఏమైందని తమ్ముళ్లు అడుగుతున్నారు. ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు నింపుతానన్న మాట ఎప్పుడు నిలబెట్టుకుంటావని నిరుద్యోగులు ప్రశ్నిస్తున్నారు. సంపూర్ణ రుణమాఫీ ఎప్పుడు చేస్తావు? ఎకరాకు 15,000 రైతు భరోసా ఎప్పుడు ఇస్తావోనని రైతులు ఎదురు చూస్తున్నారు" అని నిలదీశారు. ఇవాళ తెలంగాణలో ఏ వర్గం కూడా సంతోషంగా లేదని, రేవంత్ రెడ్డి, ఆయన తొట్టి గ్యాంగ్ మాత్రమే సంతోషంగా ఉందని, దండుపాళ్యం ముఠాలా ఏర్పడి బిల్డర్లు, కాంట్రాక్టర్లను బెదిరిస్తూ అందినకాడికి దోచుకుంటున్నారని ఆరోపించారు. "ఒక్క కొత్త స్కీము అమలు చేయలేదు. ఇచ్చిన ఒక్క హామీ నెరవేర్చలేదు. కానీ, అప్పు మాత్రం రెండు లక్షల కోట్లకు చేరింది. ఈ పైసలన్నీ ఎక్కడికి పోతున్నాయి? రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఖాతాల్లో టకీ టకీమని డబ్బులు పడుతున్నాయా?" అని నిలదీశారు. కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్ చిత్తశుద్ధి లేని శివపూజ లాంటిదని తాము ఎప్పుడో చెప్పామని దుయ్యబట్టారు. తొమ్మిదేళ్ల లో సుమా రు 9 బిలియన్ డాలర్ల(సుమారు రూ.72 వేల కోట్లు) ను నేరుగా రైతుల ఖాతాల్లో వేశామని మొన్న ఆక్స్‌ఫర్డ్ వర్సిటీలో చెబితే అక్కడున్న ప్రొఫెసర్లు, మేధావులు ఆశ్చర్యపోయారని చెప్పారు.

# కాంగ్రెస్ సర్కారుపై ధర్మయుద్ధం... (మొదటిపేజీ తరువాయి)

సీఎం రేవంత్‌రెడ్డి 600 రోజులైనా ఒక్క హామీని కూడా పూర్తి స్థాయిలో అమలు చేయలేదన్నారు. ఏఐసీసీ అంటే.. ఆలిండియా చీటింగ్ కమిటీ అని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వచ్చిందని, ఏ ప్రభుత్వం కూడా ఇంత తక్కువ సమయంలో ఇంతగా వ్యతిరేకత ఎదుర్కోలేదని అన్నారు. "ముఖ్యమంత్రి పదవికి రేవంత్‌రెడ్డిని రాజీనామా చేసి.. బీసీ నేతను సీఎంను చేయమనండి. నేను కూడా రాజీనామా చేసి బీసీ నేతను పార్టీ అధ్యక్షుడిగా ఎన్నుకుంటాం" అని రాంచందర్‌రావు.. మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సవాల్ చేశారు. ఇతర సామాజికవర్గం నేతకు ఒక పదవి ఇస్తే బీసీలకు అన్యాయం చేసినట్లు ఎలా అవుతుందని ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లపై కాంగ్రెసకు చిత్తశుద్ధి ఉంటే.. న్యాయనిపుణులతో చర్చించి నిర్ణయం తీసుకుని ఉండేదన్నారు. అసెంబ్లీలో బీసీలకు 42శాతం రిజర్వేషన్ బిల్లుకు బీజేపీ మద్దతిచ్చిందనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెసకు రాష్ట్ర ప్రజలు చుక్కలు చూపిస్తారని వ్యాఖ్యానించారు.

**బీజేపీకి వంద సీట్లు అని చెప్పబోయి..**

వంద ఎమ్మెల్యే సీట్లు, 15 ఎంపీ సీట్లు గెలుస్తామని సీఎం రేవంత్‌రెడ్డి.. ఎన్నికల్లో ఓడిపోయిన ఖర్గే ముందు వాగ్దానం చేశారని రాంచందర్‌రావు ఎద్దేవా చేశారు. వాస్తవానికి ఆ సీట్లను బీజేపీ గెలుస్తుందని చెప్పబోయి కాంగ్రెస్ గెలుస్తుందంటూ రేవంత్ నోరు జారారని అన్నారు. వంద సీట్లు గెలిచే సత్తా ఉంటే మొన్నటి ఎమ్మెల్సీ ఎన్నికల్లో సిటింగ్ సీటును ఎలా కోల్పోయారని ప్రశ్నించారు. గతంలో బీఆర్ఎస్ కూడా సారు.. కారు.. పదహారు.. అంటూ ఇలాగే ప్రగల్భాలు పలికిందని, కాంగ్రెసకు కూడా అదే గతి పడుతుందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెసకు ఒక్క సీటు కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. రైతుబంధు కింద 15 వేలు ఇస్తామని చెప్పి..ఈ సీజన్‌కు 7500 ఇవ్వకుండా 6 వేలు మాత్రమే ఇచ్చిందని, స్థానిక సంస్థల ఎన్నికలు లేకపోతే ఇవి కూడా ఎగ్గొట్టేదేనని తెలిపారు. రాష్ట్రంలో బీజేపీ బలపడుతోందని గుర్తించి రైతులను తప్పుదోవ పట్టిస్తోందని మండిపడ్డారు.

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST:MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101